# కలయో! వైష్ణవ మాయయో!

-భాగవతుల రామారావు

పరంధామయ్య మాస్టారు చనిపోయేరు!

మేస్టారి మరణవార్త దావానలంలా నిముషాల మీద ఊరంతా పాకిపోయింది. ఎక్కడ, ఎవరి నోట విన్నా ఇదే మాట- "చిర్రున చీదకుండా, ఏ జబ్బూ లేకుండా, అరగంట కిందట బజార్లో కనిపించిన మనిషి ఇంతట్లోనే చనిపోయేడంటే ఎలా నమ్మడం?"

"బతికినంత కాలం నలుగురితో కలిసికట్టుగా బతికి, కష్టాలకి కుంగిపోక, సుఖాలకి పొంగిపోక నిండు కుండలా బతికేడు మహానుభావుడు. అందుకే అంత సునాయాస మరణం ప్రాప్తించింది."

ఇలా ఎవరికి తోచిన విధంగా వాళ్లు మేస్టారి హఠాన్మరణం పట్ల తమ సంతాపాన్ని వెలిబుచ్చేరు. అందరూ ఆత్మీయుణ్ణి పోగొట్టుకున్నట్టు కన్నీరు పెట్టుకున్నారు.

చేసింది స్కూలు మేస్టరు ఉద్యోగమే అయినా మేస్టారి నిజాయితీ, నిరాడంబరత, మమకార వ్యామోహాలకు బందీకాని బతుకుతీరూ ఆయన మహోన్నత వ్యక్తిత్వానికి పెట్టని గోడలు. అందుకే 'అందరివాడు' అయిన మేస్టారి మరణం ఊర్లో అంత సంచలనం కలిగించింది.

మేస్టారు అవేళ బజారుకెళ్లి వచ్చి, గ్లాసుడు మంచి నీళ్లు తాగి వాలుకుర్చీలో చతికిలబడ్డారు- తీరిగ్గా ఆరోజు న్యూస్‌పేపర్ చదువుకుందామని.

ఇంతలో ఆ ఊరి పంచాయతీ ప్రెసిడెంట్, చిన్ననాటి స్నేహితుడు పట్టాభిరామయ్య రావడంతో ఇద్దరూ పిచ్చాపాటీలో పడ్డారు.

ఈ వయస్సులో పరంధామయ్య మేస్టారు అందరూ ఉండి, దిక్కూమొక్కూ లేనివాడిలా చెయ్యి కాల్చుకుని వండుకు తినడం పట్టాభిరామయ్యకి ఎంతో బాధగా ఉంది. మేస్టారు మాత్రం ఏవిధమైన నిర్వేదనం వ్యక్తపరచకుండా ఎప్పుడూ చిరునవ్వు చిందుతూ, హాస్యోక్తులాడుతూ కనిపించేవారు.

పట్టాభిరామయ్య అడుగుపెడుతూనే "అప్పుడే వంట పూర్తయిందా పరంధామయ్యా- తీరిగ్గా పేపరు పట్టుకున్నావ్?" అంటూ మేస్టారికి ఎదురుగుండా వున్న ఖాళీ కుర్చీలో భారీకాయాన్ని చేరవేసేడు.

"ఒక్కడి జానెడు పొట్టకి వంట ఏముంటుందోయ్? పిడికెడు బియ్యం ఉడకేస్తే చాలు. పెరుగుతో లాగించేస్తాను. పెరుగన్నంలో నాకు నంచుకుందికి కూడా అక్కర్లేదు"

"అంటే ఏమీ వండుకోలేదన్నమాట- అన్నం తప్ప? చాలా బాగుంది నీ వాలకం! పేరుకి ఎంగిలి పడుతూ కడుపు మాడ్చుకుని, వేగిరం టపాకట్టేద్దామని ఉందా?"

"చూడు పట్టాభీ! చావు మన చేతిలో లేదయ్యా. నువ్వేం తిన్నా, తినకపోయినా 'సంప్రాప్తే సన్నిహితే కాలే' వెళ్లిపోక తప్పదు. చావు బెంగ నాకు లేదు. ఎప్పుడు పిలుపు వస్తే అప్పుడు వెళ్లిపోవడానికి నేను సిద్ధంగానే ఉన్నాను" అంటూ మేస్టారు కుర్చీలో వెనక్కి వాలిపోయి, కళ్లు తేలవేసేరు.

పట్టాభిరామయ్యకు మొదట అర్థం కాలేదు. తర్వాత ఉలుకూ పలుకూ లేక కుర్చీలో మెడ పక్కకి వేలేసి నిలువు గుడ్లతో అచేతనంగా పడివున్న మేస్టార్ని చూసి అనుమానం వచ్చింది.

"పరంధామయ్యా! పరంధామయ్యా!" అంటూ మేస్టారి భుజాలు పట్టుకుని కుదిపినా ఆయనలో చలనం లేదు. ముక్కు దగ్గిర వేళ్లు పెట్టి చూస్తే మేస్టారు ఊపిరి తీస్తున్నట్టు లేదు. అప్పుడు తెలిసింది పట్టాభిరామయ్యకు- మేస్టారు నిజంగానే 'వెళ్లిపోయేరని'!

తనవేపే చూస్తున్న మేస్టారి కళ్లను వణుకుతున్న చేతుల్తో మూసివేసేడు పట్టాభిరామయ్య.

కబురు తెలియడమేమిటి ఊరు ఊరంతా మేస్టారి ఇంటి ముందు గుమిగూడేరు. నిద్దర పోతున్నట్టే ఉన్నారు మేస్టారు- చనిపోయినట్టు లేరు.

పూణేలో ఉన్న మేస్టారి పెద్దకొడుకు, చండీఘర్‌లో ఉన్న చిన్నకొడుకూ ఇద్దరికీ ఫోన్ చేస్తే వాళ్లు మర్నాడి సాయంకాలానికో మూడోనాటి ఉదయానికో కాని చేరుకోలేమని, ఊరి పెద్దలకి ఎలా ఉచితమనితోస్తే అలా చెయ్యమని చెప్పేరు. ఊరి రివాజు ప్రకారం శవం కదిలితే కాని ఆ వీధిలో వాళ్లెవరూ ఆ పూట భోజనాలు చెయ్యకూడదు గనక మేస్టారి ప్రాణస్నేహితుడు పట్టాభిరామయ్యనే పెద్దలందరూ మేస్టారి తలకొరివి పెట్టమన్నారు. అది తన ప్రియతమ స్నేహితునికి తను సమర్పించే అంతిమ నివాళిగా భావించేడు పట్టాభి.

అంత్యక్రియలకు ఏర్పాట్లు చకచకా జరిగిపోయేయి. మేస్టారి శవానికి స్నానం చేయించేరు. అప్పటికే సిద్ధం చేసిన పాడె మీద కొత్త బట్ట పరిచి శవాన్ని దానిమీద చేర్చేరు. మీదనో కొత్త బట్ట గుండెల దాకా కప్పి, తాళ్లతో గట్టిగా శవాన్ని పాడెకు బిగించి కట్టేరు. ఈలోగా మట్టికుండలో చితాగ్ని రగిలించేరు.

శవాన్ని మొయ్యడానికి సిద్ధమైన పెద్దలు నలుగురూ నాలుగు కొమ్ములూ పట్టుకుని పాడెను లేపడానికి కిందికి ఒంగున్నారు. అప్పుడు వాళ్ల కళ్లపడింది- శవం వేళ్లు కదులుతున్నాయి! పట్టి చూస్తే ఛాతీ కొంచం ఉబికి పడుతున్నట్టు కనిపించింది. వెనువెంటనే మూసివున్న మేస్టారి కళ్లు తెరుచుకున్నాయి!

వాళ్ల నోట మాట రాక విస్తుపోయి చూస్తుంటే మేస్టారి గొంతుగు వినిపించింది- "నేను బతికే ఉన్నాను! ఈ కట్లు విప్పండి. ఒళ్లు నొప్పెడుతోంది"

అందరూ విభ్రాంతులయ్యేరు. కొందరు "అమ్మో! దెయ్యం! దెయ్యం!" అంటూ భయంతో చెల్లాచెదురుగా పారిపోయేరు.

షాక్ నుంచి తేరుకున్న పట్టాభిరామయ్య చేతులు వణుకుతుంటే పాడెకు కట్టిన కట్లు విప్పేడు. మేస్టారు నీరసంగా లేచి కూచున్నారు. మేస్టారి చేతులు పట్టుకుని నిలుచోబెట్టి, పట్టాభి ఆయన్ని పొదివి పట్టుకుని మెల్లిగా నడిపించుకుంటూ తీసుకెళ్లి వరండాలో వున్న వాలు కుర్చీలో కూచోబెట్టేడు.

మేస్టారు మూగివున్న జనం వేపు చూసి, చేతులు జోడించి "మీ అందరికీ శ్రమ ఇచ్చినందుకు క్షమించండి. మీ ఆదరాభిమానాలకి కృతజ్ఞుణ్ణి. నేను ఒంటరివాణ్ణి కాదని, ఈ ఊరి జనానికి నా మీద ఇంత ఆత్మీయానురాగాలున్నాయని ఇవాళ చచ్చి తెలుసుకున్నాను" అన్నారు ఉద్వేగంతో.

నీరసంగా ఉన్న మేస్టార్ని మాట్లాడించవద్దని పట్టాభిరామయ్య జనానికి నచ్చజెప్పడంతో కాస్సేపటికి జనం ఎవరిళ్లకి వాళ్లు వెళ్లిపోయేరు- కళ్లముందు అవేళ జరిగిన అద్భుతానికి ఆశ్చర్యపోతూ. చచ్చిపోయిన మనిషి తిరిగి బతకడం వాళ్లు ఇంతవరకూ ఎప్పుడో పేపర్లలో వదంతులు చదివేరు. ఇవాళ కళ్లతో చూసేరు.

మర్నాడు పేపర్లలో పడ్డ ఈ వార్త దేశవ్యాప్తంగా

## పెళ్ళంటే?

యువకుడా! ఓ యువకుడా!
ఇన్నాళ్ళు బ్రతికావు బాధంటే తెలియక
పెళ్ళంటే నూరేళ్ళ పంటని తెలిశాక
ఆనందంగా వేశావు మూడు ముళ్ళు
అవి అవుతాయి నీ స్వేచ్ఛకు సంకెళ్ళు
నీ నవ నాగరీకపు శ్రీమతికి
వంట తెలియక నిన్ను వేధించినా
ఇంటి పని చేయక ఈసడించినా
సరసానికి ఒక్క మాటైనా తిట్టకు
విరసానికి ఒక్క దెబ్బయినా కొట్టకు
తిడితే 498/ఏ ఆయుధముంది ఒక చేతిలో
కొడితే 384 ఆయుధముంది మరో చేతిలో
కొందరి మంచి కొరకు చేసిన చట్టాలు
మనుగడ విలువ తెలియని పడతుల చుట్టాలై
అమాయకుల జీవితాలతో ఆడుతున్నాయి చెలగాటాలు
పతియే ప్రత్యక్ష దైవంగా ఆరాధించారానాడు
సుఖభోగాలకు ధనమందించే యంత్రాలన్నారీ నాడు
పరమ పావని సీతా, సుమతి, చంద్రమతులు
ఈ కాలంలో పుడితే తమ భర్తలను కోర్టుల కీడ్చించేవారేమో
బ్యూటీపార్లర్లపై వున్న మక్కువ
కానరాదు మగనిపై రవ్వంత
అశాశ్వతమైన అంగ సౌందర్యాల మోజులో
పసికూనకి పాలివ్వని తల్లులెందరో
కట్నమనే కాలనాగును కౌగిలించకు
కన్నీటి సాగరాన మునిగిపోకు
నిరుపేదను పెళ్ళాడి నీ విలువను పెంచుకో
మనసున మనసై ప్రేమించి పెళ్ళి చేసుకో
సుఖసంతోషాలను నూరేళ్ళు పంచుకో

-చిత్తజల్లు ప్రసాద్

పెద్ద సంచలనం సృష్టించింది. పత్రికల రిపోర్టర్లు, టీవీ ఛానళ్ల వాళ్లు వచ్చి మేస్టార్ని ఇంటర్వ్యూలు చేసేరు. నిద్దరపోయినట్టే తనకి అనిపిస్తున్నదని, అంతకు మించి తనకేమి జరిగిందో తెలియదని మేస్టారు అందరికీ ఒకే మాట చెప్పారు.

❍ ❍ ❍

పరంధామయ్యగారు తన తండ్రి తాతల నుంచీ వెలగబెట్టిన 'అచ్చొచ్చిన' కులవృత్తి- బడిపంతులు ఉద్యోగమే- చేపట్టేరు. ఇద్దరబ్బాయిలకి కిందా మీదా పడి డిగ్రీ దాకా చదువు చెప్పించేరు. వాళ్లకి ఉద్యోగాలవగానే పెళ్లిళ్లు చేసేసి తండ్రిగా తన బాధ్యత తీర్చుకున్నారు.

"ఈ రోజుల్లో ఉద్యోగాలు కాదుగాని పిల్లలు తల్లిదండ్రులతో కలిసి ఉండకుండా ఇలా పెళ్లవగానే అలా వేరు కాపురాలు పెట్టడానికి ఉద్యోగాలు చక్కటి నెపం అయిపోయింది" అంటాడు పట్టాభి స్నేహితుణ్ణి దృష్టిలో పెట్టుకుని.

మొదట్లో మేస్టారి అబ్బాయిలు మూడు నాలుగేళ్లు పండుగలకి, పబ్బాలకి, సెలవు పెట్టుకుని వచ్చేవారు. అయితే ఆ ఉన్న నాలుగు రోజులు అమ్మా నాన్నల్తో కంటె అత్తవారిళ్లల్లోనే ఎక్కువ రోజులు గడిపేవారు. తర్వాత్తర్వాత వాళ్ల రాకపోకలు క్రమంగా ఎడబడ్డాయి. కారణాలు సవాలక్ష. అంతరాలు, కాలప్రభావానికి వాళ్లు అతీతులు కారు. ఈ పరిస్థితి మేస్టారు ఒక్కరికే కాదు. అధికాంశం తల్లిదండ్రులు అనుభవిస్తున్నదే.

ఈ దుస్థితికి మేస్టారంటే ఎడ్జస్టయిపోయేరు కాని కన్నబిడ్డల ఎడబాటుకి లోలోపునే కుమిలిపోతూ ఆరోగ్యం పాడుచేసుకున్న వారి శ్రీమతి రెండేళ్ల కిందట మేస్టార్ని ఒంటరివాడిని చేసి తిరిగిరాని లోకానికి వెళ్లిపోయింది. తామరాకు మీది నీటిబుడగలా జీవించడం అలవర్చుకున్నారేమో మేస్టారు వృద్ధాప్యంలో ఒంటరితనం మనో నిబ్బరాన్ని సడలించకుండా నిలదొక్కుకున్నారు.

మేస్టారు రోజూ సాయంత్రం ఊళ్లోని వేణుగోపాల స్వామి గుడికి వెళ్లి దైవదర్శనం చేసుకుని భగవంతుడు ఇచ్చిందానికి కృతజ్ఞతలు నివేదించుకునేవారు కాని దేవుణ్ణి ఎప్పుడూ ఏమీ అర్థించేవారు కాదు. దేవుణ్ణి కోరికలు కోరడమేమిటి? కొలుచుకోవాలి కాని! దేవుడంటే కోరికలు తీర్చేవాడా? దేవుణ్ణి ఆపద మొక్కులవాడి స్థాయికి దిగజార్చ కూడదు- ఇదే మేస్టారి తత్వం.

అందుకే అందరూ మేస్టార్ని ఒక సాధూబాబాలా, కర్మయోగిలా, నిస్సంగిగా గౌరవాదరాల్తో ఆదరించేవారు.

అలాంటి మేస్టారు అవేళ హఠాత్తుగా మరణించడం, మళ్లీ అంత హఠాత్తుగానే పాడెమీంచి లేచి కూచోవడం ఆ ఊరి జనానికి అంతుపట్టని విషయం.

కళ్ల ముందు జరిగిన ఈ కథ అందరికీ తెలిసిందే.

కళ్లకి కనిపించని కథ- మేస్టారు 'కళ్లు మూసి' మళ్లీ 'కళ్లు తెరిచే'లోగా ఆ నాలుగ్గంటల వ్యవధానంలో అదృశ్యంలో జరిగిన కథ- ఎవరికీ తెలియదు. ఒక్క మేస్టారికి తప్ప!...

❍ ❍ ❍

యమధర్మరాజు దర్బార్‌లో పరంధామయ్య మేస్టార్ని యమభటులు హాజరు పరిచేరు.

ఇంతలో అచ్చు మన అల్లు రామలింగయ్య పోలికలున్న ఓ మిస్టర్ నక్క వినయాలు ఉరకలూ పరుగుల్తో రొప్పుకుంటూ వచ్చి, "సార్! సార్! పెద్ద బ్లండర్ జరిగిపోయింది! మన బడుద్ధాయిలు, యమకింకరులు, ఎల్.టి.సి. (లైఫ్ టెర్మినేషన్ కేలెండర్)- ఆయువు మూడినవాళ్ల పట్టిక-లో మీ ముందు హాజరు పరిచిన ఈ జీవి పేరు కనిపించగానే ముందు వెనుకలు చూడకుండా ఇతని ప్రాణాలు పుటుక్కుమనిపించి ఇక్కడికి తీసుకొచ్చి స్వర్గానికీ నరకానికీ మధ్య పెద్ద ఉపద్రవం సృష్టించేరు" అని విన్నవించేడు.

"ఏమిటి మీరనేది? ఆయువు మూడిన జీవిని ఇక్కడికి తీసుకువస్తే స్వర్గంతో వచ్చిపడ్డ ఉపద్రవం ఏమిటి?" యమధర్మరాజుల వారి మాటల్లో విసుగుదల ధ్వనించింది.

"అదే స్వామీ నేను చెప్పబోయేది. నన్నే నేను నమ్మని చేదస్తం మనిషిని కదా? అందులో కంప్యూటర్లంటేనే నాకు ఎలర్జీ. ఎందుకేనా మంచిదని ఈ జీవి పాపాల లెడ్జెర్ చూద్దునూ- ఎంట్రీలన్నీ పుణ్యాలే తప్ప ఒక్కటంటే ఒక్క పాపమేనా పోస్టింగ్ కాలేదు! రూల్సు ప్రకారం ఇంతటి పుణ్యాత్ముణ్ణి ఇక్కడికి- నరకానికి- కాక సరాసరి స్వర్గానికి తీసుకెళ్లాలి. అయితే ఈ కలికాలంలో కలికం వేసి చూసినా పుణ్యాత్ములు కనిపించరన్న ఓవర్ కాన్ఫిడెన్స్‌తో మన తెయ్యమ్మలు యమస్పీడ్‌లో దేవదూతల కంటె ముందే ఈ పుణ్యాత్ముని తమ కస్టడీలోకి తీసుకుని హుటాహుటి మీ ముందు హాజరు పరిచేరు.

ఈ సంగతి దేవదూతలు దేవేంద్రుల వారికి రిపోర్టు చేస్తే కొంపలంటుకుంటాయ్. స్వర్గలోక 'అతిథి'ని మన భటులు యమలోకానికి హైజాక్ చేసినందుకు దేవేంద్రులవారు స్వర్గలోక ఆధిపత్యం జ్యూరిస్‌డిక్షన్‌లోకి మనం ట్రెస్‌పాస్ చేసేమని మన మీద అగ్గిరుద్రులయి పోతారు. 'కంటెప్ట్ ఆఫ్ పేరడైజ్' నేరం కింద మనకి 'షోకాజ్ నోటీస్' జారీచెయ్యొచ్చు. భూలోకంలో పార్లమెంట్‌కీ సుప్రీమ్‌కోర్టుకీ జ్యూరిస్‌డిక్షన్ విషయంలో రగులుతున్న చిచ్చు మన దద్దమ్మలు ఇప్పుడు సరాసరి స్వర్గానికీ నరకానికీ మధ్య రగిలించేరు! ప్రభువుల వారే ఈ తప్పు సరిదిద్ది ఈ ఉపద్రవం నుంచి గట్టెక్కే తక్షణ తరుణోపాయం ఆలోచించాలి" అని గుక్క తిప్పుకోకుండా గడగడ చెప్పేసి చేతులు కట్టుకుని సవినయంగా నిలుచున్నాడు అల్లు రామలింగయ్య ఉరఫ్ మిస్టర్ నక్కవినయాలు.

వాళ్లు తన గురించే తర్జన భర్జన పడడం గమనించిన మేస్టారు వాళ్ల సంభాషణకి అడ్డు తగిలి, సింహాసనం మీద ఆసీనులైవున్న యమధర్మరాజు వేపు తిరిగి, "అయ్యా! తమరు ఎవరు? అచ్చు మా అల్లు రామలింగయ్యలా వున్న ఈ మిస్టర్ నక్కవినయాలు ఎవరో కాని ఇతను ప్రతి మాటకీ మాటకీ మధ్య మా తెలుగు వాళ్లలాగే తెగ ఇంగ్లీషు ముక్కలు దంచేస్తున్నాడు. ఎవరీ నక్కవినయాలు?" అని అడిగేరు.

"నన్నే ఎరుంగవా నరుండా? నేనే యముండ! సర్వజీవుల ప్రాణహరుండ. యమలోక అధినాయకుండ. ఈయన మా చిత్రగుప్తుండు" అన్నాడు యమధర్మరాజు తన హేండిల్ బార్ మీసాలు మెలివేస్తూ, తెలుగు సినీయముడు సత్యనారాయణ పోజులో.

"ఎన్ని 'ఉండ'ల్నీ, 'ముండ'ల్నీ చేసుకుంటావ్ నిన్ను నువ్వు? ఈ ఉండలభాష పక్కనపెట్టి, ముందు నన్ను జబర్దస్తీగా ఇక్కడికెందుకు తీసుకొచ్చేరో అది చెప్పు!"

"అదే స్వామీ మేం మాట్లాడుకుంటున్నది. మీరు పుణ్యాత్ముల్లోకల్లా పరమ పుణ్యాత్ములు. ఎలాంటి పుణ్యాత్ములూ స్వర్గానికి నేరుగా పోలేరు. స్వర్గానికి దారి నరకం ద్వారానే. మీలాంటి వి.వి.ఐ.పీ.లని నేనే స్వయంగా ఎస్కార్ట్ చేస్తూ స్వర్గలోకానికి తీసుకు వెళ్లడానికి చెయ్యవలసిన ఏర్పాట్ల గురించే చిత్రగుప్తునితో చర్చిస్తున్నాను... ఒక్క నిమిషం" అని 'హాట్‌లైన్'లో "దేవేశ్వరా! శుభవందనం! ఒక ముఖ్య అతిథిని మీ వద్దకు తీసుకువస్తున్నాను. ప్రొటోకాల్ విషయంలో కొంచం పొరపాటు జరిగింది. అది వచ్చేక విన్నవించుకుంటాను. అతిథి స్వాగత ఏర్పాట్లకు వీలుగా మీకు ముందుగా తెలుపుడు చేస్తున్నాను" అని చెప్పి ఫోన్ పెట్టేసేడు కాలయముడు.

యముడు ఎవరితో మాట్లాడేడో మేస్టారికి సరిగ్గా అర్థం కాలేదు. దేవేశ్వరుడంటే దేవదేవుడు శ్రీమన్నారాయణుడే అయుండాలి- అనుకున్నాడు.

తన సొంత వాహనం మహిషం మీద మేస్టార్ని

## అల్లుళ్లకు వినతి

వచ్చేస్తున్నయ్ వచ్చేస్తున్నయ్
దండగమారి పండగలెన్నో
అల్లుళ్లని తెచ్చేస్తున్నయ్
గుమ్మాలన్నీ నిట్టనిలువునా
రంగుల హోలీ అద్దుకొని
కొత్త పెళ్లి కూతురిలా ముస్తాబు
దసరా పండగ వచ్చిందంటే
అల్లుళ్లకు ఎంతో సరదా
దీపావళి వచ్చిందంటే
అల్లుడి నోట ఏ క్రేకర్ ఎలా పేలుతుందో
అత్తకు మామకు దిగులు
కోటి కోర్కెల చిట్టాతో
కొత్త అల్లుడు బుద్ధ విగ్రహమై
నట్టింట్లో బాసింపట్టా
పాపం అత్తలు మామలు
కాలుగాలిన పిల్లులై
ఇంట్లోకి బయటకీ
ఒకటే ఒకటే తిరుగుడు
ఏ ఛానెలులో / ఏ బాంబు పేలనుందో
ఏ క్షణానికి
ఏ ప్రమాదం ముంచనుందో
ఎరగని అత్తలు మామలు
అల్లుడి నోటివంక
అదేపనిగా చూపులు
కోరరాని కోరిక కోరేడో
ఏ కోర్కెలతో కొంపముంచుతాడో
ఒకటే బిత్తర చూపులు
కొత్తల్లుళ్లూ కొంచెం దయతలచండి
గుడ్లను బాగా మెక్కండి
బంగరు బాతును మాత్రం బలిచెయ్యకండి
అఖిలాండకోటి బాధాద్రష్ట మామల తరఫున
సుఖలాలస భోగుల అల్లుళ్లకందరికీ
ఇదేనండి నా వినతి

-బద్ది నాగేశ్వరరావు

తన సరసన కూచోబెట్టుకుని మహిషధ్వజుడు దేవలోకం చేరుకున్నాడు.

వందిమాగధులు ఎదురొచ్చి మేస్టారికి "స్వాగతం! సుస్వాగతం!" అంటూ పుష్పవర్షం కురిపిస్తూ సకల మర్యాదల్తో స్వాగతం పలికేరు. రంభా తిలోత్తమాది దేవకన్యలు కర్పూర హారతులిచ్చేరు. కిన్నర కింపురుషులు స్వాగత గీతాలు ఆలాపించేరు. దేవేంద్రుడే ఎదురొచ్చి మేస్టార్ని పూలమాలాలంకృతుణ్ణి చేసి ఉచితాసనం పైన ఆసీనుణ్ణి చేసేడు.

మేస్టారికి ఈ కృతక మర్యాదలు ఎబ్బెట్టుగా అనిపించేయి. సన్మానాలు, పొగడ్తలంటే ఆయనకు అసలు నచ్చవు. ఆసనంలోంచి లేచి నిలబడి దేవేంద్రుని వేపు తిరిగి "మహాశయా! తమరు ఎవరో తెలుసుకో వచ్చా? ఈ అట్టహాసాలేమిటి? ఎందుకోసం?" అని

## ఉద్యోగవర్షము

వస్తున్నవి, వస్తున్నవి ఉద్యోగపు జడివానలు,
వడివడిగా నేడో, రేపో
వేలల్లో, లక్షల్లో వేతనాలు చెల్లించే లక్షలాది
ఉద్యోగాలొస్తున్నాయొస్తున్నాయ్.
బడా బడా కంపెనీలు కొత్త కొత్త పథకాలతో
మీ కొరకై తెస్తున్నవి. లేవండిక లేవండిక
నిరుద్యోగ తమ్ముళ్లూ! దస్త్రాలను సర్దుకొని అస్త్రాలను
సంధించుడు
మేధావులు విచారించి పలికిన సత్యమిది
అంతా స్వదేశి సరుకే, విదేశీల పాలు లేదు
వ్యాపారంబెవరైనా ఎందుకొరకు చేసెదరు
లాభార్జన కొరకే గాని, దానం, ధర్మం కొరకా!
సాఫ్ట్‌వేర్, కాల్‌సెంటర్, గ్రాఫిక్స్, హోటల్స్
ప్రచారము, టూరింగ్, టి.వి.లు, రేడియోలు, ఫ్యాషన్
టెక్నాలజీలు
సేవల ఉద్యోగాలను లక్షల్లో తెస్తున్నవి.
అంతరిక్షయానంలో, ఆకాశపుటంచుల్లో
ఊహల ఉయ్యాలల్లో విహరించి, తరించిపోవ.
సుజలాం, సుఫలాం మలయజ శీతలాం, సస్య
శ్యామలాం
అయినా ఈ భూమిలోన ఆహారం పండించరు
అత్యవసర వస్తువులను అసలే సృష్టించలేరు
అందరికీ తిండి దొరకు ఆలోచనలసలుండవు
సారవంతమౌ భూమిసెజ్‌లకూ, ఎజ్‌లకే
గ్రామీణుల, గిరిజనుల, భూపుత్రుల క్షుధార్తులను
ఈ సేవలు తొలగించునె.
మేధావులు తమ మెదళ్లు మరమ్మతు చేసుకొని
నేలమీద చూపునిలిపి, సామాన్యుడి వెతలు తెలిసి
సర్వజన శ్రేయంబే తమకూ శ్రేయంబనెంచి
కొందరి సంపద కాదు, అందరి సంపద పెంచే
సర్వజనం సుఖశాంతుల వర్ధిల్లెడు విధమ్మెంచి
తగు విధాన పథకాలను రచనచేసి, అమలు చేసి
జనజీవనవాహినిలో కలసిపొండి, తరించండి
జనంలేక మీరు లేరు. ఇది శాశ్వత సత్యం సుమి.

**-వి.యల్.ప్రసాదరావు**

అడిగేరు అంతా అయోమయమనిపించి.

"అయ్యో! స్వామీ! నన్నే ఎరుగరా? నేను దేవలోక అధిపతిని దేవేంద్రుణ్ణి."

"చూడగానే పోల్చుకుందికి తమరేం గాంధీ మహాత్ములా? వివేకానంద స్వాములా? మీ వేషధారణ, దర్పం, మేకప్పూ, ఏదో సినిమా షూటింగ్ జరగబోతున్నట్టు ఈ ఆర్భాటాలూ చూసి, ఎప్పుడో స్వర్గం చేరుకున్న మా ఎన్టీఆరేమోనని అనుమానం వచ్చింది. అనుక్షణం ఏ రాక్షసుడో, ఏ మునీశ్వరుడో సింహాసన భ్రష్టుణ్ణి చేస్తారని బితుకు బితుకుమనే దేవేంద్రులు తమరేనా!? నేను మీ సింహాసనం కోరడంలేదు. భయపడకండి! అసలు నన్ను ఇక్కడికెందుకు రప్పించినట్టు?"

"అదేమిటి స్వామీ! పుణ్యాత్ములు మరణించేక ప్రాప్తించేది స్వర్గమే కదా! ఇక్కడ దేవతల దివ్య భోగాలన్నీ మీకు ఉపలబ్ధి అవుతాయి. రంభా ఊర్వసులు మీ అడుగులకి మడుగులొత్తుతారు. అమృత సేవనం చేస్తూ మీ ఇష్టావిలాసంగా ఇక్కడ సకల భోగాలూ అనుభవించ వచ్చు-"

"హతవిధీ!" అంటూ మేస్టారు చెవులు మూసుకుని, "ఆపవయ్యా! మహ చెప్పొచ్చేవ్! విషయ వాంఛలు అనుభవించడానికి ఇంత దూరం ఈ స్వర్గానికి రావాలా? మా భూలోకంలో మీ స్వర్గాన్ని తలదన్నే మల్టీప్లెక్స్‌లూ, ఎంటర్‌టైన్మెంట్ ప్లాజాలూ ఉన్నాయి. మా వాళ్లు తాగే లిక్కర్లతో పోలిస్తే మీ అమృతం ఆముదంతో సమానం. మా మల్లికా షెరావతులూ, కరీనా కపూర్లూ, రాఖీ సావంతుల ముందు మీ రంభా ఊర్వసులు దిష్టిపిడతలే- ఇక్ష్వాకుల నాటి తొత్తులు!

స్వర్గానికి పోయినా సవతి పోరు తప్పదన్నట్టు జీవితకాలం విషయ వాంఛలకు అతీతంగా ఉంటూ నిస్సంగిగా బతికింది ఈ తుచ్ఛ స్వర్గ సుఖాల్ని అనుభ వించడానికా? దేవేంద్రుని పరిపాలన ఇంత అధ్వాన్నంగా ఉంటుందని అనుకోలేదు. మీకంటే మా భూలోకంలో మా రబ్రీదేవి నయం- చదువూ సంధ్యలు లేకపోయినా వంటింట్లో గరిటె తిప్పుతూ బీహారు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎడంచేత్తో ఓ ఏలుబడి ఏలింది!

మీ బోడి స్వర్గం ఎవరిక్కావాలి? నాకు తెలీదను కున్నారా- 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి'- ఇక్కడికి వచ్చినవాళ్లు పుణ్యం క్షీణించిన తర్వాత, బేక్ టు ది పెవిలియన్, తిరిగి మానవలోకానికి పంపివెయ్య బడతారని? మళ్లీ వాళ్లకి పునరపి జననం పునరపి మరణం- చక్రభ్రమణం తప్పదు. నా విషయంలో మీరేదో పొరబడ్డట్టున్నారు. నన్ను వైకుంఠానికి తీసుకు వెళ్లకుండా స్వర్గంలో పడుండమంటారేమిటి? మాటల్తో నన్ను మభ్యపెట్టక వెంటనే నన్ను వైకుంఠానికి తీసుకు వెళ్లండి" అన్నారు దృఢ స్వరంతో.

దేవేంద్రుడు ఇరకాటంలో పడ్డాడు. ఇలాంటి కేసు అతడు ఇంతవరకూ ఎదుర్కోలేదు. అసలు యముడి వల్లే వచ్చింది ఈ లేనిపోని పితలాటకం. "చూసేవా యమధర్మరాజా! నువ్వు చేసిన నిర్వాకం? నా నెత్తిని పెట్టేవు ఈ తేనతుట్ట!... జరగకూడనిదేదో జరిగే పోయింది. పద! వైకుంఠానికి ఇతణ్ణి తీసుకెళ్లి దేవదేవునికి విన్నవించుకుందాం" అన్నాడు దేవేంద్రుడు చేసేది లేక.

పుష్పక విమానం మీద మేస్టార్ని తీసుకుని మరుక్షణం మహావిష్ణువు సన్నిధి చేరుకున్నారు. శ్రీవారు సర్వజ్ఞులు గనక ఏం జరిగిందోవారికి ముందే తెలుసు.

మేస్టార్ని చూడగానే చిరుమందహాసంతో శ్రీవారు "నరుడా! ఏమి నీ కోరిక?" అని అడిగేరు.

పరమాత్ముని ప్రశ్న విని మేస్టారు తెల్లబోయేరు. సర్వాంతర్యామి ఆంతర్యం అర్థమయి, మేస్టారి మోహం చిన్నబోయింది.

"నీ ఒకే ఒక ప్రశ్నతో, స్వామీ! నా అల్పజ్ఞత నాకు అర్థం అయింది. అయినా అడిగేవ్ గనక చెప్పక తప్పదు. నేను భూలోకంలో ఏ పనీ ఏదో కామనతో చెయ్యలేదు. ఓ తండ్రికి కొడుకుగా, భార్యకి భర్తగా, పిల్లలకి తండ్రిగా, విద్యార్థులకు సుబోధకునిగా, సమాజంలో బాధ్యతాయుత పౌరునిగా నా కర్తవ్యాన్ని నిష్ఠతో నిర్వహిస్తూనే బంధ మోహాలకు బందీ కాకుండా నిష్కామిగా, నిస్సంగిగా బతికేనే తప్ప నాలో మరో ప్రలోభం లేదు. నిత్యం నిన్ను కొలిచేవాణ్ణే తప్ప ఎన్నడూ నిన్ను ఏమీ కోరినవాణ్ణి కాదు. 'కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన' అన్నది నీ ప్రేరణే కదా?

నేను అడక్కుండా నువ్వు ఇవ్వగలిగింది ఒక్కటే- జన్మరాహిత్యం. నీ కొలబద్ద ప్రకారం నేను ఇంకా ఆ స్థితికి చేరుకోలేదన్నమాట. పరమపద ప్రాప్తికి 'అలమటించడం' కూడా ఒక కామనయే- కోరికే! అని ఇప్పుడే తెలుసుకున్నాను. అందుకే రాగానే నన్ను ఏమి నీ 'కోరిక' అని అడిగేవ్. 'నరుడా'! అని సంబోధించి, వైకుంఠానికి వచ్చినా నాలో ఇంకా నరవాసనలు పోలేదని నర్మ గర్భంగా తెలియజెప్పేవ్!

నేనెంత దౌర్భాగ్యుణ్ణి! పరంధాముని సన్నిధి చేరుకున్నా ఈ పరంధాముడికి పరంధాముని 'సన్నిధి' దక్కలేదు"

మేస్టారింకా చెప్పడం పూర్తిచెయ్యలేదు. ఇంతలో చిత్రగుప్తుడు ఆపసోపాలు పడుతూ హడావిడిగా వచ్చి, "మహాప్రభో! ఘోరం జరిగిపోయింది" అంటూ స్వామివారి కాళ్లమీద పడ్డాడు.

స్వామివారు అర్థవంతంగా చిరునవ్వు నవ్వుతూ "ఏం జరిగింది చిత్రగుప్తా? మీ యమలోకాన్ని, ప్రస్తుతం యమధర్మరాజు అక్కడ లేని ఈ సమయంలో, ఏ రాక్షసుడో, ఓసామా బిన్ లాడెనో మెరుపుదాడి చేసి ఆక్రమించుకోలేదు కదా?" అని అడిగేరు.

"అదేం కాదు ప్రభూ! మీ సమ్ముఖంలో వున్న ఈ జీవికి ఇంకా అంత్యకాలం ఆసన్నం కాలేదు! ఇదే తిథిని, ఇదే టైముకి భూలోక కాలమానంలో వాళ్ల కేలండర్ ప్రకారం 2009లో ఇతనికి ఆయువు మూడుతుంది. కంప్యూటర్ ఎర్రర్ వల్ల మా భటులు ఇవాళే ఇతని ప్రాణాలు గుటుక్కుమనిపించీసేరు! తక్షణం ఇతని మృతదేహంలో ఇతని ప్రాణాన్ని పునఃప్రవేశింపజెయ్యాలి. ఇతని దేహానికి ఈ లోపునే దహన సంస్కారం జరిగి పోయి వుంటే మరి మనం చేసేది ఏమీ లేదు. పరమ పుణ్యాత్ముడైన ఈ జీవి శరీరం లేక ప్రేతాత్మగా ఉండి పోవాలి. ఇది విధాత విధి విధానాన్ని, సృష్టి స్థితి లయ ప్రక్రియను అతిక్రమించడమే ఔతుంది" అన్నాడు చిత్రగుప్తుడు.

అంతా విన్న శ్రీవారి మోహంలో మందస్మితం చూస్తే చిత్రగుప్తుడికి అనుమానమొచ్చింది- ఎన్నడూ జరగని పొరపాటు ఈ జీవి విషయంలో జరిగిందంటే అంతా శ్రీవారి 'మాయా'!?

"ముందు ఇతని శరీరం ఉందో లేదో చూద్దాం" అంటూ వైకుంఠస్వామి సింహాసనం మీది ఒక బటన్ నొక్కేరు. ఎదురుగుండా వున్న పెద్ద సెటిలైట్ స్క్రీన్ మీద మేస్టారి ఇంటి ముంగిట దృశ్యం కనిపించింది. జనం మూగి ఉన్నారు. పాడెకు కట్టివున్న మాస్టారి శవాన్ని ఎత్తడానికి శవవాహకులు సన్నద్ధం అవుతున్నారు.

శ్రీవారు ఆ దృశ్యం చూసి, "హమ్మయ్య! గండం గట్టెక్కింది. దహన సంస్కారం జరిగిపోలేదు. తక్షణమే ఇతని ప్రాణాలు ఇతని బొందిలో జారవిడువు" అని చిత్రగుప్తుని ఆదేశించేరు.

మరుక్షణం భూలోకంలో పాడె మీది మాస్టారు కళ్లు తెరిచేరు. చనిపోయిన మేస్టారు లేచి కూచున్నారు.

○ ○ ○

పట్టాభిరామయ్యతో మాట్లాడుతూ మాట్లాడుతూ మేస్టారి కన్నులు మూతపడి, నాలుగు గంటల తర్వాత మళ్లీ కళ్లు తెరిచేక అతనిలో అంతర్నిహితంగా వున్న భావోద్వేగమే ఓ కలలా తను భ్రమించవచ్చు- అది కేవలం మానసిక వికారమో, మనోలయమో తప్ప నిజంగా తను చూసివుండ లేదని మేస్టారి నమ్మకం. కారణం- ఆ నాలుగ్గంటల నేపథ్యంలో దైవ వ్యవస్థని అవహేళన చేసే విధంగా తాను లోనయిన అభూత అనుభూతి మనోవైకల్యమే తప్ప నిజం కాదని మేస్టారి నమ్మకం. అంచేత మేస్టారు ఎవరికీ, ప్రాణస్నేహితుడు పట్టాభికి కూడా, తాను 'చనిపోయేక' ఏమయిందో తనకేమీ తెలియదనే చెప్పి, ఆ మాటమీదే నిలబడ్డారు. అయితే మేస్టారికి ఓ తృప్తి మిగిలింది- ఈ అలౌకిక చిత్తభ్రాంతి ద్వారా తనలోని దోషాలు తనకి తెలిసేయి!

వాళ్లిద్దరే ఉన్నప్పుడు పట్టాభిరామయ్య "పరంధామయ్యా! నిన్ను అలా పిలిస్తే ఇవాళ నిజంగా ఆ పరంధాముడే నాకు నీలో కనపిస్తున్నాడయ్యా! ఎందుకంటే 'చచ్చి'బతికినా ఏమీ జరగనట్టు నిశ్చలంగా ఉన్నావ్. నువ్వు మాలాంటి సామాన్యుడివి కావు. మృత్యుంజయుడివి! నువ్వు తప్పు పట్టుకోకపోతే ఓ మారు నీ పాదాలకి మొక్కాలని ఉంది" అని అర్థించేడు మనస్ఫూర్తిగా.

"వద్దు పట్టాభీ! నాలో వున్న భగవంతుడే నీలోనూ, అన్ని జీవుల్లోనూ ఉన్నాడు. నమస్కారం వెనుక అసలు సంస్కారం ఏమిటంటే నమస్కరించే వ్యక్తి తను ఎవరికీ నమస్కరిస్తున్నాడో అతను తనకంటె సర్వవిధాలా అధికుడూ, ఉత్తముడూ, యోగ్యుడని గుర్తించి, అతని ముందు తన అల్పత్వాన్ని స్వచ్ఛందంగా నివేదించుకుని ఆవిధంగా తనలోని అహంకారాన్ని అదుపులో పెట్టుకునేందుకు నమస్కరిస్తాడు. అయితే ఇది నమస్కారం పెట్టించుకున్న మనిషిలో తాను 'అధికుణ్ణి' అన్న అహంభావం పెంచే ప్రమాదముంది. అందుకే నమస్కరించిన మనిషి ఇతరత్రా తనకంటె అల్పుడే అయినా నమస్కరించుకున్న మనిషి ప్రతినమస్కారం చెయ్యాలన్న నియమం ఉంది. ప్రతి నమస్కారం చెయ్యడం ద్వారా తాను అధికుణ్ణి అన్న అహంకారం అతనిలో ఉత్పన్నం కాదు. మన ఇద్దరి మధ్యా వున్న అనుబంధం ఈ నమస్కారాలకి అతీతమైనది. మన నేస్తం ఇలాగే కొనసాగనీ... ఇంకెన్నాళ్లు- మరో ఏడాది!" కొస రెండు మాటలూ మనసులోనే అనుకున్నారు మేస్టారు. ■

# సుకవి జీవించె ప్రజల నాల్కలయందు

-సిద్ధాంతాపు ప్రభాకరాచార్యులు

సామాజిక జీవితం, సామాజిక చైతన్యాన్ని నిర్ణయిస్తుంది. అలాగే కవి, కళాకారుడి జీవితం అతను సృష్టించే కవిత్వంలోను, కళాఖండాలలోను ప్రతిఫలిస్తుంది. అస్పృశ్యత, దారిద్ర్యం తన సహచరులుగా పెరిగిన జాషువ జీవితానుభవాలు అతని కవిత్వంలోని పటుత్వానికి ప్రేరణ.

1895 సెప్టెంబర్ 28న 'వినుకొండ' గ్రామ సమీపంలోని మిస్సమ్మతోటలోని ఇంటిలో వీరయ్య, లింగమాంబ దంపతులకు జన్మించిన బిడ్డ జాషువ. వీరయ్య, లింగమాంబలది వర్ణాంతర వివాహం కావటంచే ఇరువైపుల బంధువులు నిరాదరించారు. దానితో దరిద్ర దేవతకు చేరువగా జాషువ బాల్యం గడిచింది. తోటి పిల్లలతో ఆడుకోవాలన్నా, ఆసక్తిగా ఊళ్లో ఆడే నాటకం చూడాలన్నా "అంటరానితనం" ఆ పసి హృదయాన్ని గాయపర్చింది. ఈసడింపులు ఆ లేత మనస్సుపై చెరగని ముద్రలు వేశాయి.

జీవితం నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. నాకు గురువులు ఇద్దరు. ఒకరు పేదరికం ఇంకొకరు కుల మత భేదం. ఒకరు నాకు సహనాన్ని నేర్పితే మరొకరు నాలో ఎదిరించే శక్తిని పెంచారు. ఆసక్తితో దారిద్ర్యాన్ని, కుల మత భేదాన్ని ఎదిరించి నేను మనిషిగా నిరూపించుకోదలిచాను. అందుకే వాటిపై కత్తి కట్టాను. అయితే నా కత్తి "కవిత", నా కత్తికి సంఘంపై ద్వేషం లేదు. దాని విధానంపైనే ద్వేషం... అని ప్రకటించిన ధీశాలి 'జాషువ'. జాషువాకు గురుత్వాన్ని ఇవ్వడానికి ఎవ్వరూ ముందుకు రాకపోతే రాత్రిపూట రహస్యంగా ఊరికి దూరంగా ఉన్న పాడుపడ్డ మసీదులో గుడ్డిదీపపు వెలుతురులో పురాణేతిహాసాలు అధ్యయనం చేసి పద్య సౌందర్యాన్ని చేజిక్కించుకున్నాడు.

జాషువ పుట్టింది తెలుగు గడ్డపై కాబట్టి ఆయన ఈ తెలుగు నేలపై గల అభిమానాన్ని ప్రకటించుకున్నాడు.

*"బహు దేశముల బేర్వడసి మీసము దీటు*
*భరత ఖండంబు నా పాఠశాల*
*స్తన యుగంబున గాన సాహిత్యములు గల్గు*
*భాషా వధూటి నా పంతులమ్మ*
*సాందీపని సమక్షమందు విద్యగడించు*
*వనమాలి నా సహపాఠకుండు*
*భక్తి వైరాగ్య భావముల తావలమైన*
*భాగవతంబు నా బాలశిక్ష*
*గంటము ధరించి మోహనాక్షరము లెనయ*
*బ్రతిఫలించెడు నా మహోన్నత విభూతి*
*వ్రాసికొందును దశ దిశ ఫలక పంక్తి*
*గడనకెక్కిన యాంధ్రపుత్రుడను నేను"* అంటూ తన ఆంధ్రాభిమానాన్ని ప్రకటించి, అంతటితో ఆగకుండా...

*"ప్రమథనాథుని నీరు ద్రావింప జాలిన*
*వజ్రాల కొడుకుల బడసినావు*
*నరకాధిపతి గుండె గరగింప జాలిన*
*వెలది మిన్నల కుగ్గు పెట్టినావు*
*బ్రహ్మయంతటి వాని వణికింపజాలిన*
*మునుల మూపున నిడిమోసినావు*
*అంటినంతన పాప మడగింప జాలిన*
*తీర్థకోటుల మున్గితేలినావు*
*ఉర్విబుట్టక ముందె నీ వుంటివేమొ*
*సకలశాస్త్ర పురాణముల్ చదివినావు*
*గొన బుసిరి గల భాగ్యశాలివి నీవు*
*భారతాంబామణీ! నమస్కారమమ్మ"* అంటూ దేశమాతను స్తుతించి తన దేశాభిమానాన్ని చాటుకున్నాడు. భరత ఖండంబును తన పాఠశాలగా ఆరాధించాడు.

ఎన్నో ఆటుపోట్లను, ఒడిదుడుకులను, విషాదానందాలను, కష్టనష్టాలను, తిరస్కారాలను అన్నింటినీ స్థితప్రజ్ఞుడిగా అనుభవించడం వలన సాధించుకున్న అపారమైన జీవితానుభవాలు 'జాషువ' కవిత్వానికి ప్రాణవాయువులైనాయి. నిజాయితీ, నిబద్ధతలు తన కవిత్వానికి గీటురాళ్లుగా పెట్టుకున్న 'జాషువ' కవితాభిమానుల చేత సాహితీ సంస్థల చేత వేయికి పైగా సన్మానాలు పొందారు. కవికోకిల, కవితా విశారద, కవిదిగ్గజ, మధుర శ్రీనాథ, నవయుగ కవి చక్రవర్తి, విశ్వకవి సామ్రాట్ మొదలైన బిరుదులు ఈ కవికి లభించాయి. గండపెండేరము ధరించి, కనకాభిషేకాలు పొంది, గజారోహణం చేసి పగటి దివిటీ పల్లకిలో ఊరేగిన జాషువాను 'గుంటూరు' పట్టణం స్వేచ్ఛా పౌరసత్వమిచ్చి గౌరవించింది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, కళాప్రపూర్ణ, పద్మభూషణ బిరుదులు జాషువాను వరించాయి.

జాషువ కవితా చైతన్యానికి నిలువుటద్దం అతని 'గబ్బిలము'. కవి తన మనోభావాలను, అశ్రుసందేశాన్ని కావ్య నాయకుడైన అరుంధతీ సుతుని ద్వారా గబ్బిలానికి తద్వారా సమాజానికి తెలియజేస్తాడు. గబ్బిలమే గాక ఫిరదౌసి, స్వప్నకథ, నేతాజి, స్వయంవరం, కొత్తలోకం, క్రీస్తుచరిత్ర, ముంతాజ్ మహల్, నాకథ, కాందిశీకుడు, బాపూజి, రాష్ట్ర పూజ మొదలైన రచనలు చేసిన జాషువ కవిత్వం ఆధునిక తెలుగు కవిత్వాన్ని ఒక ఊపు ఊపి, ఆత్మాభిమానంతో కూడిన ఆగ్రహాన్ని ప్రకటించడమే గాక 'దళిత వాస్తవికతా ప్రస్థానం'లో పరిణత దశను సూచించిందనుటలో అతిశయోక్తి లేదు.

బాల్యం నుండి ఏ కుల భేదం అతని ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తూ వచ్చిందో, ఏ కుల భేదం అతని వ్యక్తిత్వాన్ని బాకున కమ్మిందో ఆకుల భేదాన్ని దానికి కేంద్ర బిందువుగా ఉన్న 'అస్పృశ్యత'ను తన ఉన్నత వ్యక్తిత్వంతో, తన పదునైన కవితా కుఠారంతో జీవితాంతం ఎదిరించాడు.

తన కాలం నాటి విలువలను ప్రశ్నించి, ప్రతిఘటించి, భావితరాలకు మార్గ నిర్దేశం చేసిన జాషువ 1971 జులై 24న తన తుదిశ్వాస విడిచాడు.

*"రాజు జీవించె రాతి విగ్రహములందు*
*సుకవి జీవించె ప్రజల నాల్కల యందు"* అన్న కవి వాక్కు అక్షరసత్యం. జాషువ కవిత్వం, అతని భావావేశం వర్తమాన తరానికి ఆదర్శం. ■